సాక్షి
రంగారెడ్డి
గురువారం : 15 : మే : 2025



అక్కడ ట్రైనింగ్...
భారత బలగాలు ధ్వంసం చేసిన ఉగ్రవాద క్యాంపుల్లో మురిద్కేలో ఉన్న ఎల్ఈటీ టెర్రర్ ఫ్యాక్టరీ కూడా ఉంది. 10లో▸



ఎఫ్‌టీఎల్‌లో మట్టి డంపింగ్
గంగరాయన్ చెరువులో ఎన్ఓసీ పేరుతో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వందలాది టిప్పర్ల మట్టి నింపుతున్నారు. 10లో▸



విద్యుదాఘాతంతో ..
జిల్లేడ్ చౌదరిగూడ మండలం భైరంపల్లిలో బుధవారం విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. 10లో▸

న్యూస్‌రీల్

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత
చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఎమ్మెల్యే కాలె యాదయ్యను సన్మానిస్తున్న పాండురంగం దంపతులు

చేవెళ్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని కమ్మెట చౌరస్తాలో ఆదిగురువు శ్రీదక్షిణామూర్తి ఆలయాన్ని గ్రామానికి చెందిన పాండురంగం నిర్మించారు. బుధవారం ఈ మందిరాన్ని ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మదచల గురుపీఠ రాజయోగాశ్రమ సేవా సమాఖ్య సభ్యుల సమక్షంలో ఏర్పాటు చేసిన గురు మందిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగులు వెంకటేశం, హన్మంత్‌రెడ్డి, సురేందర్, రాంచంద్రయ్య, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలకు ఆహ్వానం



ఎమ్మెల్యే సబితారెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కందుకూరు: పులిమామిడిలో పునఃనిర్మించిన శివరామాంజనేయ స్వామి విగ్రహప్రతిష్ఠాపన పూజలకు హాజరవ్వాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం వారు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు పూజాకార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దామోదర్‌గౌడ్, శ్రీనివాస్, పాండుగౌడ్, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రులకే తరలించాలి
108 సిబ్బందికి
ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ 108 సిబ్బంది, వైద్యారోగ్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తున్నారనే విమర్శలున్నాయని.. పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌కు వచ్చేవారితో మర్యాదగా మెలగాలి



పెట్రోలింగ్ వాహనాన్ని పరిశీలిస్తున్న డీసీపీ రాజేశ్

కడ్తాల్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించడంతోపాటు సమస్యలను వెంటనే పరిష్కరించాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. కడ్తాల్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎస్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల ఫైళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలను పాటిస్తూ విధులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. శాంతిభద్రతలను పరిరక్షిస్తూ సమాజంలో పోలీసుల గౌరవాన్ని పెంచాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ గస్తీ పెంచాలని ఆదేశించారు. డయల్ 100కు వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్, ఎస్ఐ శివశంకర వరప్రసాద్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కార్పొరేట్ దందా!



సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యా సంవత్సరం ప్రారంభించకముందే.. కళాశాలల గుర్తింపు, రెన్యూవల్స్ ప్రక్రియ పూర్తివ్వకుండానే పలు కార్పొరేట్ రెసిడెన్షియల్ ఇంటర్మీడియెట్ కాలేజీలు అడ్మిషన్లకు అడ్డదారులు తొక్కుతున్నాయి. బోర్డు నిబంధనలకు విరుద్ధంగా మార్కెటింగ్ ఏజెంట్ల(పీఆర్‌ఓ)ను నియమించుకుని గుట్టుగా అడ్మిషన్లు చేపడుతున్నాయి. కాలేజీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం లేకపోయినా.. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను తమ కాలేజీ ఖాతాలో వేసుకుని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయి. ఈ విషయం తెలిసిన ఇంటర్ బోర్డు సైతం కిమ్మనడం లేదు. తప్పుడు ప్రకటనలు ఇచ్చిన ఆయా కళాశాలలపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మార్కెటింగ్ ఏజెంట్లు చెప్పిందే నిజమని నమ్మి, పిల్లల భవిష్యత్ దృష్ట్యా తల్లిదండ్రులు సైతం ఏమీ ఆలోచించకుండా ఆయా కాలేజీల్లో అడ్మిషన్లు తీసుకుంటున్నారు. అడ్వాన్స్‌గా రూ.10 వేలు చెల్లించిన వారికి యాజమాన్యాలు సీటు ఖరారు చేస్తున్నాయి.

13 కాలేజీలకే గుర్తింపు

మే 22 నుంచి ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ముగిసిన తర్వాత జూన్ 2 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుంది. ఈ లోపే ఆయా కాలేజీలన్నీ గుర్తింపు, రెన్యూవల్స్ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంది. జిల్లాలో 18 ప్రభుత్వ జూనియర్, రెండు ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాలలుండగా 221 ప్రైవేటు రెసిడెన్షియల్ కాలేజీలున్నాయి. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, గండిపేట్, బాలాపూర్ మండలాల్లో అత్యధికంగా కాలేజీలు ఉన్నాయి. వీటిలో మెజార్టీ రెసిడెన్షియల్ కాలేజీలు రెండు ప్రముఖ విద్యా సంస్థలకు సంబంధించినవే. ఇందులో పలు కాలేజీలకు సొంత భవనాలు కూడా లేవు. స్థానిక సంస్థల అనుమతులు సహా ఫైర్ సేఫ్టీ విభాగం అనుమతులు లేని ఇరుకైన అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 13 ప్రైవేటు కాలేజీలకు మాత్రమే గుర్తింపు పొందినట్లు ఇంటర్మీడియట్ బోర్డు తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించింది. మిగిలిన వాటికి ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదు. వాటికి వస్తుందన్న గ్యారంటీ కూడా లేదు. కానీ ఇప్పటికే ఆయా కాలేజీలన్నీ అడ్మిషన్లు చేపట్టాయి.

అడ్మిషన్లు పూర్తి చేసుకునే ప్రక్రియ

2024–25 విద్యా సంవత్సరంలో ఫస్ట్ ఇయర్‌లో 76,967 మంది వార్షిక పరీక్షలకు హాజరు కాగా, వీరిలో 59,227 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్‌లో 67,586 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై.. 52,526 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనుంది. ఇంటర్ బోర్డు ఓ వైపు పరీక్షల విషయంలో తలమునకలై ఉండగా.. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు మాత్రం అకడమిక్ ఇయర్‌కు ముందే అడ్మిషన్లు పూర్తి చేసుకునే పనిలో పడ్డాయి. ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాల్స్ సహా అధ్యాపకులను ఏజెంట్లుగా నియమించుకున్నాయి. వీరు కాలేజీకి గుర్తింపు లేకపోయినా ఉన్నట్లు, వసతి గృహంలో మౌలిక సదుపాయాలన్నీ ఉన్నట్లు, నీట్, జేఈఈ, ఎప్‌సెట్ వంటి పోటీ పరీక్షల్లో ఎవరికీ రాని ర్యాంకులు తమ కాలేజీలో చదివిన వారికే వచ్చినట్లు చెప్పి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు.

టీపీటీఎల్ఎఫ్ ఫిర్యాదు

వేసవి సెలవుల్లో కాలేజీలు తెరవ కూడదు కానీ, ఆదిబట్ల, కొంగర, హయత్‌నగర్, తట్టి అన్నారం, కోహెడ, కొండాపూర్, అయ్యప్ప సొసైటీ, రాయదుర్గం, సరూర్‌నగర్‌లోని పలు రెసిడెన్షియల్ కాలేజీల్లో గుట్టుగా తరగతులు నిర్వహిస్తున్నాయి. అధ్యాపకులను బలవంతంగా కాలేజీకి రప్పించడంతో పాటు అడ్మిషన్ల కోసం వారికి టార్గెట్లు ఇస్తున్నాయి. ఇందుకు నిరాకరించిన అధ్యాపకులను ఇకపై మీరు కాలేజీకి రావాల్సిన అవసరం లేదంటూ హుకుం జారీ చేస్తున్నాయి. విధిలేని పరిస్థితుల్లో వారు తమ బంధువుల పిల్లలు, చుట్టు పక్కల ఉన్న విద్యార్థులను గుర్తించి, కాలేజీలో చేర్పించే పనిలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉంటే అడ్మిషన్లు తీసుకురావాలని అధ్యాపకులపై ఒత్తిడి తెస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రైవేటు లెక్చరర్స్ ఫెడరేషన్(టీపీటీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో ఆ సంఘం ప్రతినిధులు మంగళవారం ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శికి ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా వేసవి సెలవుల్లోనూ విధులకు హాజరు కావాలని ఒత్తిడి తెస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అనుమతులకు ముందే అడ్మిషన్లు

- అడ్డదారులు తొక్కుతున్న ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు
- మార్కెటింగ్ ఏజెంట్లను నియమించుకుని కమీషన్లు
- అధ్యాపకులకూ తప్పని టార్గెట్లు
- ఒక్కో విద్యార్థికి రూ.1.40లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఫీజు
- ఫిర్యాదులను పట్టించుకోని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు

అడ్డగోలు ఫీజులు.. బలవంతపు వసూళ్లు

కార్పొరేట్ రెసిడెన్షియల్ కాలేజీలు ఒక్కో విద్యార్థి నుంచి రూ.1,40,000 నుంచి రూ.2 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయి. వీటికి తోడు పుస్తకాలు, డ్రెస్సులు, ఇతర ఛార్జీలు అదనం. ఏసీ క్యాంపస్‌లల్లో ఫీజులు మరింత ఎక్కువగా ఉన్నాయి. ఇందుకు ప్రతిఫలంగా ఒక్కో అడ్మిషన్‌పై మార్కెంటింగ్ ఏజెంట్లకు రూ.20 వేల వరకు కమీషన్లు ఇస్తున్నాయి. పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇచ్చి జాయిన్ అయిన తర్వాత ముక్కు పిండి మరీ మొత్తం ఫీజులు వసూలు చేస్తున్నాయి. అకడమిక్ ఇయర్ మధ్యలో ఎటూ వెళ్లలేక, కాలేజీ యాజమాన్యంతో గొడవకు దిగితే.. పిల్లల భవిష్యత్ దెబ్బతింటుందనే భావనతో తల్లిదండ్రులు అప్పు చేసి మరీ పిల్లల ఫీజులు చెల్లిస్తున్నారు. ముందే మొత్తం ఫీజు చెల్లిస్తున్న తల్లిదండ్రులు కాలేజీకి వెళ్లేందుకు నిరాకరిస్తున్న పిల్లలను వెళ్లాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. బలవంతంగా కాలేజీకి పంపడాన్ని జీర్ణించుకోలేక పలువురు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్న సందర్భాలు లేకపోలేదు.

ఇంటర్ ప్రవేశాలకు నేడు, రేపు కౌన్సెలింగ్

షాద్‌నగర్‌రూరల్: హైదరాబాద్, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు గురు, శుక్రవారం కౌన్సెలింగ్ ఉంటుందని రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జునరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 15న బాలురు, 16న బాలికలకు హయత్‌నగర్ కల్వంచ గురుకుల ప్రతిభా కళాశాలలో ఉదయం 10గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు టీసీ, టెన్త్ మెమో, స్టడీ కండక్ట్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణపత్రం, 2024–25 ఇన్‌కం సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, స్పోర్ట్స్, పీహెచ్‌సీ ధృవీకరణపత్రం, మూడు పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రూ.1.5లక్షలు, పట్టణ ప్రాంత విద్యార్థులకు రూ.2లక్షల ఆదాయం మించకుండా ఉండాలని సూచించారు. హైదరాబాద్ జిల్లాలోని జంగమ్మెట్(బాలికలు) ఎంపీసీ, బీపీసీ, రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం (బాలురు) ఎంపీసీ, బీపీసీ, కందుకూరు(బాలురు) సీఈసీ, హెచ్ఈసీ, కొత్తూరు (బాలురు) సీఈసీ, హెచ్ఈసీ, జిల్లాలోని కుల్కచర్ల (బాలురు) ఎంపీసీ, బీపీసీ, కొడంగల్ (బాలురు) ఎంపీసీ, బీపీసీ, తాండూరు (బాలికలు) ఎంపీసీ, బీపీసీ, ఎంఎల్‌టీ, సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం(బాలురు) ఎంపీసీ, బీపీసీ, నారాయణఖేడ్(బాలురు) ఎంపీసీ, బీపీసీ, కంగ్టి(బాలురు) సీఈసీ, హెచ్ఈసీ, జహీరాబాద్ (బాలికలు)ఎంపీసీ, బీపీసీ, కరాసుగుత్తి (బాలికలు) ఎంపీసీ, బీపీసీ, సిర్గాపూర్ (బాలికలు) ఎంపీసీ, బీపీసీ గ్రూపులలో చేరేందుకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతీ గ్రూపునందు ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ, స్పోర్ట్స్, పీహెచ్‌సీ కేటగిరీలో పరిమిత సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 95020 20715, 96034 31550, 90144 47896 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

గిరిజన, చెంచులకు కొత్త పథకం

- పోడు భూముల సాగుకు 'ఇందిర గిరి సౌర జల వికాసం'
- ఈ నెల 18న ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన, చెంచుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని.. ఇందులో భాగంగా ఇందిర గిరి సౌర జల వికాసం పథకం ప్రారంభించాలని నిర్ణయించిందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందించేందుకు నిరంతరం శ్రమిస్తుందన్నారు. గత ప్రభుత్వం గిరిజన, చెంచుల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. చెంచులు సాగు చేసుకునే పోడు భూములకు పట్టాలిచ్చినా సాగునీటి వసతి లేక ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఈ భూములను వినియోగంలోకి తెచ్చేందుకు రూ.12,600 కోట్లతో ఇందిర గిరి సౌర జల వికాసం పథకాన్ని పరిచయం చేస్తున్నారని చెప్పారు. ఈ పథకంలో పోడు పట్టాలున్న రైతులకు సాగునీటి వసతి కల్పించడంతో పాటు సౌర విద్యుత్ అందిస్తుందని వివరించారు. చెంచులకు 10 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఈ పథకాన్ని ఈ నెల 18న నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని మన్ననూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రివర్గం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా భూముల్లో పంటలొద్దు

- కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో వ్యవసాయ అధికారుల ప్రచారం
- వానాకాలంలో సాగు చేపట్టొద్దని వాట్సాప్‌లో మెసేజ్‌లు

యాచారం: ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో వానాకాలం సాగు చేపట్టకుండా కట్టడి చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే భూ సర్వే, ఫెన్సింగ్ పనులు పూర్తి చేస్తున్న అధికారులు, ఆ భూముల్లో రైతులు సాగు చేస్తే కబ్జాల నుంచి కదిలించడం కష్టమనే భావనలో ఉన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు 2025 వానాకాలం పంటల సాగు చేయొద్దని రైతులకు వివరిస్తున్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు యాచారం మండలంలోని ఫార్మాసిటీకి భూములు సేకరించిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. నేరుగా భూములిచ్చిన రైతులను కలిసి చెప్పడంతో పాటు ఆయా గ్రామాల్లోని వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పంపుతున్నారు. ఇన్నాళ్లు ఫార్మాసిటీ భూముల పర్యవేక్షణను కేవలం రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులే చూసేవారు. కొత్తగా వ్యవసాయ శాఖను భాగస్వామ్యం చేయడం చర్చనీయాంశంగా మారింది.

పరిహారం పెంచుతాం

యాచారం మండల పరిధిలోని నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీ ఏర్పాటుకు పది వేల ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూములను సేకరించేందుకు గత బీఆర్ఎస్ సర్కార్ నిర్ణయించింది. నాలుగు గ్రామాల్లో 7,640 ఎకరాల అసైన్డ్, పట్టా భూమి సేకరించి పరిహారం అందజేసింది. ఇంకా 2,200 ఎకరాల పట్టా భూమిని రైతులు ఫార్మాసిటీకి ఇవ్వడానికి ఆసక్తి చూపకపోవడంతో ఆ భూమిపై అవార్డులు పాస్ చేసి పరిహారాన్ని రైతుల పేరిట అథారిటీలో జమ చేసింది. రైతుల పేరిట ఉన్న భూరికార్డులను టీజీఐఐసీ పేరు మీద మార్చేసింది. నాలుగేళ్లుగా టీజీఐఐసీ పేరు మీద మార్చేసిన భూరికార్డులను తమపై మార్చాలని రైతులు చెప్పులరిగేలా తిరిగిన ఫలితం లేకుండా పోతోంది. రైతులు హైకోర్టును ఆశ్రయించడం.. న్యాయ స్థానాలు వారికి అనుకూలంగా తీర్పులు ఇచ్చినా అధికారులు మాత్రం మొండి వైఖరిగానే వ్యవహరిస్తున్నారు. రికార్డులు మార్చేది లేదు.. అవసరమైతే పరిహారం పెంచుతాం.. భూములు ఇవ్వమంటున్నారు. ఈ 2,200 ఎకరాలు సైతం ప్రభుత్వ స్వాధీనంలో ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

అందరికీ నమస్కారం,
రైతులకు విజ్ఞప్తి,
జిల్లా కలెక్టర్ , జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల ప్రకారం, మన యాచారం మండలంలో ఎవరైతే ఫార్మా సిటీ కింద, (ముఖ్యంగా మేడిపల్లి , నానక్ నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలు) భూములు ప్రభుత్వం అధీనంలో ఉన్నదో అట్టి భూములలో ఎలాంటి పంటలను ఈ వచ్చే వానాకాలం 2025 సీజన్ లో సాగు చేయకూడదని మనవి.
ఇట్లు,
మీ వ్యవసాయ శాఖ,
యాచారం మండలం,
రంగారెడ్డి జిల్లా.
4:4

వాట్సాప్ గ్రూపుల్లో వ్యవసాయ శాఖ అధికారుల పోస్టు



నక్కర్తమేడిపల్లిలో ఫార్మాసిటీకి సేకరించిన భూమి

నిబంధనలు ఉల్లంఘించొద్దు



నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీకి భూములు ఇచ్చిన రైతులు వానాకాలం పంటలు సాగు చేయొద్దని ప్రచారం చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు నాలుగు గ్రామాల్లో విస్తరణ అధికారుల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘిస్తే నేరం అవుతుంది.

– రవినాథ్, మండల వ్యవసాయాధికారి, యాచారం

గాలివాన బీభత్సం



పామెన గ్రామంలో విరిగిన విద్యుత్‌స్తంభం

- నేలకూలిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- పిడుగుపాటుకు కాడెడ్ల మృత్యువాత

చేవెళ్ల/మొయినాబాద్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా బలమైన ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసి పలు చోట్ల పిడుగులు పడ్డాయి. రోడ్లు, పంట పొలాలు, కాల్వల్లో వరద నీరు పారింది. మున్సిపల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల పరిధిలోని చేవెళ్ల, దేవునిఎర్రవల్లి, పామెన, చనువెళ్లి, బస్తేపూర్, తదితర గ్రామాల్లో కుండపోత వర్షంతో పిడుగులు పడ్డాయి. చేవెళ్లలో ఓ కాలనీలో పిడుగుపాటుకు ఓ ఇళ్లుపై గోడ పాక్షికంగా దెబ్బతింది. పామెనలో విద్యుత్ స్తంభం విరిగడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. గ్రామంలో పట్నం సదానందంకు చెందిన రెండు ఎద్దులు పిడుగు పడి మృతి చెందాయి.



పామెనలో పిడుగుపాటుకు మృతి చెందిన కాడెడ్లు

వాహనదారులకు ఇక్కట్లు

మొయినాబాద్‌లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. గాలివాన కారణంగా విద్యుత్ వైర్లు తెగిపడి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అమ్డాపూర్, వెంకటాపూర్‌లో రోడ్డుపై చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ చౌరస్తాలలో రోడ్లుపై భారీగా నీళ్లు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రెండు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది.



దేవునిఎర్రవల్లిలో పొలాల్లో పారుతున్న వరద



అమ్డాపూర్‌లో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

భార్యను కడతేర్చిన భర్త

అనుమానంతో హత్య


నాజియా బేగం(ఫైల్)


జాకీర్ అహ్మద్

పహాడీషరీఫ్: అనుమానం పెనుభూతమై కట్టుకున్న భార్యను కిరాతకంగా హత్య చేసిన ఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ ప్రాంతానికి చెందిన జాకీర్ అహ్మద్, నాజియాబేగం(30) దంపతులు. వీరికి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు సంతానం. ఆటో నడుపుతూ జీవనం సాగించే జాకీర్ సంపాదనతో కుటుంబ పోషణ భారమైంది. దీంతో నాజియా ప్రైవేట్ జాబ్ చేస్తోంది. ఈ క్రమంలోనే ఆమెపై అనుమానం పెంచుకున్న జాకీర్ తన మకాంను ఈనెల 1న బాలాపూర్ ఠాణా పరిధిలోని కొత్తపేట న్యూ గ్రీన్‌సిటీ కాలనీకి మార్చాడు. మంగళవారం అర్ధరాత్రి భార్యతో గొడవపడి కర్రతో తలపై మోది, గొంతుకు చున్నీ బిగించి హత్యచేశాడు. అక్కడి నుంచి పారిపోయి, బుధవారం ఉదయం అత్త రుబీనాబీకి ఫోన్ చేసి చెప్పాడు. తల్లి, కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించగా నాజియా అప్పటికే మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

‘పోలీసులతో ప్రాణభయం’

హెచ్‌ఆర్సీని ఆశ్రయించిన బాధితుడు

మొయినాబాద్: ‘పోలీసులతో నాకు ప్రాణభయం ఉంది.. భూ వివాదంలో తలదూర్చి దగ్గరుండి ప్రీకాస్ట్ గోడను తొలగించారు. అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు నాపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు’ అని నాగిరెడ్డిగూడకు చెందిన సంతపురం అనిల్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. తన తండ్రి నుంచి వారసత్వంగా రావాల్సిన భూమిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించానన్నారు. దీంతో తనకు సగం వాటా ఇస్తూ 2024 జూన్ 6న కోర్టు ఫైనల్ డిక్రీ ఇచ్చిందని తెలిపారు. దీని ప్రకారం 2025 మార్చి 13న కొత్త పట్టాదారు పాసుపుస్తకం వచ్చిందన్నారు. కోర్టు ద్వారా వచ్చిన భూమి చుట్టూ నెల రోజుల క్రితం ప్రీకాస్ట్ వాల్ నిర్మించుకున్నామన్నారు. ఏప్రిల్ 21న అర్ధరాత్రి సమయంలో సుమారు 30 మంది పోలీసులు, కొంత మంది వచ్చి గోడను ధ్వంసం చేశారని, తనపై తప్పుడు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారని వివరించారు. పోలీసుల తీరును తప్పుపడుతూ జడ్జి మందలించడంతో 41 నోటీసులు ఇచ్చి పంపించారని తెలిపారు. ఇటీవల మళ్లీ పోలీస్ స్టేషన్‌కు రావాలంటూ వేధిస్తున్నారన్నారు. ఇది భరించలేక మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ విషయమై మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. భూమిని కొనుగోలు చేసిన వారు ఇరవై ఏళ్లుగా కబ్జాలో ఉన్నారని, వారు నిర్మించిన ప్రహరీ, చెట్లను ధ్వంసం చేయడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని సైబరాబాద్ కమిషనర్‌కు హెచ్‌ఆర్సీ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

కేశంపేట: రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని చింతగూడెం గ్రామానికి చెందిన వంగూరి రాజు, తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన నక్కరమోని క్రిష్ణ బంధువులు. ఇరువురు కలిసి కేశంపేట గ్రామ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరుగుతున్న పెళ్లికి బైక్‌పైన వెళ్తున్నారు. మార్గమధ్యలో మండల కేంద్రంలో ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పైన ఉన్న ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

అక్కడ ట్రైనింగ్...
ఇక్కడ యాక్షన్!

> ‘‘ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత బలగాలు ధ్వంసం చేసిన తొమ్మిది ఉగ్రవాద క్యాంపుల్లో మురిద్కేలో ఉన్న లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ) టెర్రర్ ఫ్యాక్టరీ కూడా ఉంది. లాహోర్ సమీపంలో నియంత్రణ రేఖకు 30 కిమీ దూరంలో ఉన్న ఈ కీలక క్యాంప్‌ను మర్కజ్ తోయిబా అని పిలుస్తారు. దీనితో హైదరాబాద్‌కు అనేక లింకులు ఉన్నాయి. ఇక్కడి నుంచి వెళ్లిన, ఇక్కడ పట్టుబడిన అనేక మంది ఉగ్రవాదులు, సానుభూతిపరులు మర్కజ్ తోయిబాలో శిక్షణ పొందడమో, అక్కడ జరిగే వార్షిక సమావేశాల్లో పాల్గొనడమో చేసిన వాళ్లే. 1993 నాటి జలీస్ అన్సారీ, 1998లో చిక్కిన పాకిస్థానీ సలీం జునైద్ నుంచి ఇప్పటికీ మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న కుర్మగూడకు చెందిన ఫర్హాతుల్లా ఘోరీ వరకు ఈ కోవకు చెందిన వాళ్లే.’’
> - సాక్షి, సిటీబ్యూరో

మురిద్కేలో ధ్వంసమైన ఎల్‌ఈటీ ‘టెర్రర్ ఫ్యాక్టరీ’

- సిటీ ఉగ్రవాదుల్లో పలువురికి అది సుపరిచితం
- జలీస్ అన్సారీ నుంచి ఫర్హాతుల్లా ఘోరీ వరకు...
- నగరంలో జరిగిన విధ్వంసాలకు అక్కడే కుట్రలు

1993 నుంచి లింకులు...

ఐఎస్‌ఐ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ ఎల్‌ఈటీ ఉగ్రవాద సంస్థ 1987లో ప్రారంభమైంది. దీని ఛాయలు నగరంలో 1993 నుంచీ ఉన్నాయి. ముంబైకి చెందిన జలీస్ అన్సారీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన అబ్దుల్ కరీం టుండా, కోల్‌కతాకు చెందిన అబ్దుల్ మసూద్, వరంగల్‌కు చెందిన ఆజం ఘోరీ తన్జీమ్ ఇస్లాహుల్ ముస్లిమీన్ (టీఐఎం) పేరుతో ఓ ఉగ్రవాద సంస్థను ఏర్పాటు చేశారు. 1993లో నగరంలోని అబిడ్స్, నాంపల్లి, సికింద్రాబాద్, హుమాయున్‌నగర్, మౌలాలీల్లో బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. ఆజం ఘోరీతో (2000లో జగిత్యాలలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు) పాటు మిగిలిన ముగ్గురూ మర్కజ్ తోయిబాలో శిక్షణ పొందిన వారే. 1998లో పాకిస్తాన్ నుంచి పాతబస్తీకి వచ్చి, ఇక్కడి యువతను ఉగ్రవాదం వైపు మళ్లిస్తూ సలీం జునైద్ పట్టుబడ్డాడు. ఇతడూ అదే టెర్రర్ క్యాంప్‌లో శిక్షణ పొందిన వాడే.

మరో సంస్థ ఏర్పాటు చేసిన ఆజం ఘోరీ...

టీఐఎం ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఆజం ఘోరీ 1999లో ఇండియన్ ముస్లిం మహ్మదీయ ముజాహిదీన్ (ఐఎంఎంఎం) ఏర్పాటు చేశాడు. నగరంలోని ఆరు ప్రాంతాలతో పాటు విజయవాడ, బోధన్, నిజామాబాద్‌ల్లోనూ విధ్వంసాలు సృష్టించిన ఈ మాడ్యూల్‌లోని అనేక మంది మురిద్కే వరకు వెళ్లి శిక్షణ పొంది వచ్చిన వాళ్లే. 2001లో గణేష్ నిమజ్జనంలో పేలుళ్లకు కుట్ర పన్నిన అబ్దుల్ అజీజ్ అలియాస్ గిడ్డా అజీజ్, 2002లో దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబ దేవాలయం వద్ద పేలుడుకు పాల్పడిన ఆజం, అజీజ్ తదితరులు, 2004లో సికింద్రాబాద్‌లోని గణేష్ టెంపుల్ పేల్చివేతకు కుట్ర పన్నిన నసీరుద్దీన్ మాడ్యూల్, 2005లో నగర వ్యాప్తంగా పేలుళ్లకు కుట్రపన్నిన నవీద్ మాడ్యూల్... వీటన్నింటి వెనుక ఎల్‌ఈటీనే ఉంది. ఈ విధ్వంసాలు, కుట్రలకు పథక రచన చేసి, పాల్గొన్న వారిలో అత్యధికులు మురిద్కే వరకు వెళ్లి మర్కజ్ తోయిబాను ‘చూసి’ వచ్చిన వాళ్లే.


భారత బలగాల దాడిలో ధ్వంసమైన పాకిస్తాన్‌లోని మురిద్కే


ఆజం ఘోరీ


ఫర్హాతుల్లా


అబ్బు అజీజ్


అబ్దుల్ కరీం టుండా


జలీస్ అన్సారీ

సౌదీలో ఉద్యోగాల పేరుతో ఎర వేసి...

నగర యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించే ఎల్‌ఈటీ, దాని అనుబంధ సంస్థల నిర్వాహకులు వారిని నేరుగా మర్కజ్ తోయిబాకు చేర్చలేదు. ఎల్‌ఈటీ స్లోగన్స్‌లో ‘హైదరాబాద్ లిబరేషన్’ కూడా కీలకం కావడంతో నగరం, కాన్పూర్‌లకు చెందిన యువతనే ఎక్కువగా ఆకర్షించే వాళ్లు. వీరిని ఉద్యోగాల పేరుతో సౌదీకి తీసుకువెళ్లి అక్కడి నుంచి మురిద్కే పంపేవాళ్లు. ఉగ్రవాద శిక్షణ పూర్తయిన తర్వాత బంగ్లాదేశ్, నేపాల్ మీదుగా హైదరాబాద్ చేర్చేవాళ్లు. మర్కజ్ తోయిబాలో ఉన్న ట్రైనర్లకూ నగరంపై మంచి పట్టు ఉండేది. శిక్షణ కోసం వెళ్లిన యువతతో ఉర్దూలో మాట్లాడటం, సిటీలో ఉన్న కీలక ప్రాంతాల వివరాలు అడగటం చేసే వాళ్లు. చిక్కిన ముష్కరులు, వారి సానుభూతిపరుల విచారణలో ఈ విషయం గుర్తించిన నిఘా వర్గాలు ఆ ట్రైనర్లు ఇక్కడ సంచరించి వెళ్లినట్లు అనుమానాలు వ్యక్తం చేశారు.

ఫర్హాతుల్లా పాత్ర అత్యంత కీలకం...

ఎల్‌ఈటీతో పాటు మర్కజ్ తోయిబాలోనూ కూర్మగూడ వాసి ఫర్హాతుల్లా ఘోరీ పాత్ర అత్యంత కీలకమని నిఘా వర్గాలు చెప్తున్నాయి. 1998లోనే ఉగ్రవాదం వైపు మళ్లిన ఇతగాడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 2002లో గుజరాత్‌లోని అక్షర్‌ధామ్ దేవాలయంపై జరిగిన దాడి కేసుతో ఇతని వ్యవహారాలు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి. 2004లో నగరం కేంద్రంగా బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి హత్యకు కుట్ర జరిగింది. ఘోరీ అప్పట్లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ జైషేమహ్మద్‌కు (జేఈఎం) సానుభూతిపరుడిగా ఉండి ఈ కేసులోనూ నిందితుడిగా మారాడు. ఆ తర్వాత 2005లో టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై జరిగిన మానవబాంబు దాడి కేసులోనూ నిందితుడిగా ఉన్నాడు. 2012 నాటి బెంగళూరు ‘హుజీ కుట్ర’ కేసులోనూ వాంటెడ్‌గా ఉన్నాడు. 2022లో దసరా నేపథ్యంలో విధ్వంసాలకు కుట్రపన్ని హ్యాండ్ గ్రెనేడ్స్‌తో సహా చిక్కిన ‘ఉగ్ర త్రయం’లో కీలకమైన జాహెద్‌తోనూ సంబంధాలు కలిగి ఉన్నాడు. ఇతను గత ఏడాది వరకూ మర్కజ్ తోయిబాలో జరిగే వార్షిక సమావేశాలకు హాజరయ్యాడు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చేవెళ్ల: పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి ఎనిమిది మంది జూదరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవునిఎర్రవల్లి సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారంతో రాజేంద్రనగర్ జోన్ ఎస్‌ఓటీ సీఐ అంజయ్య, ఎస్‌ఐలు రవికుమార్, రాజశేఖర్‌రెడ్డిల బృందం ఈ దాడులు నిర్వహించింది. ఫాంహౌస్‌లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకొని, వారి వద్ద నుంచి సెల్‌ఫోన్‌లు, 8 కార్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో పేకాటరాయుళ్లు ఆన్‌లైన్ ద్వారా దాదాపు రూ.2.41 లక్షలు చేతులు మారినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్య


జాస్మిన్ (ఫైల్)

నాగోలు: భర్త వేధింపుల కారణంగా ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఖమ్మం పట్టణానికి చెందిన కట్టా వెంకటేశ్వర్లు కుమార్తె జాస్మిన్(29)కు ఎల్‌బీనగర్, శివపురి కాలనీ చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పెండెం రాజశేఖర్‌తో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ. 25 లక్షల నగదు, 20 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. వివాహం జరిగిన కొన్నాళ్లకే రాజశేఖర్, అతడి కుటుంబ సభ్యులు జాస్మిన్‌ను అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్ద మనుషులు ఆమెకు నచ్చజెప్పి కాపురానికి పంపించారు. అయినా తన వైఖరి మార్చుకోని రాజశేఖర్ కొన్నాళ్లకే జాస్మిన్‌ను కొట్టి పుట్టింటికి పంపించాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజశేఖర్‌ను పిలిపించిన పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మంగళవారం ఆఫీస్‌కు వెళ్లిన రాజశేఖర్ సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూడగా లోపలి నుంచి గడియపెట్టి ఉంది. జాస్మిన్‌ను పిలిచినా స్పందన లేకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు పగలకొట్టి చూడగా జాస్మిన్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. కిందకు దింపి చూడగా అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. దీంతో అతను ఎల్‌బీనగర్ పోలీసులు, జాస్మిన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. జాస్మిన్ శరీరంపై గాయాలను గుర్తించిన ఆమె కుటుంబ సభ్యులు రాజశేఖర్ ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీ

అక్కడికక్కడే వృద్ధుడి మృతి

ఇబ్రహీంపట్నం: రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపేట్‌కు చెందిన మద్దెల ఎట్టయ్య (70) స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ప్రజ్ఞా కళాశాల సమీపంలో రోడ్డు దాటుతుండగా ఆరుట్ల వైపు వేగంగా వెళ్తున్న కారు, అదుపు తప్పి ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన ప్రమాదస్థలంలోనే మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, బాడీని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి మృతదేహాన్ని తరలించారు.

ఎఫ్‌టీఎల్‌లో మట్టి డంపింగ్


చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో దంప్ చేసిన మట్టి కుప్పలు

తుర్కయంజాల్: గంగరాయన్ చెరువులో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ఎన్‌టీసీ పేరుతో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వందలాది టిప్పర్ల మట్టి నింపుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


కళేబరం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం బైరంపల్లిలో బుధవారం సాయంత్రం విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కమ్మరిపేట మల్లయ్య తన ఆవును పొలం వద్ద మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఆవు విలువ రూ.70 వేలు ఉంటుందని, బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి


సంతోష్ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: తాటిపై నుంచి కింద పడి గీత కార్మికుడు మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంతపల్లి గ్రామానికి చెందిన అంతటి సంతోష్(45) వృత్తిరీత్యా గీత కార్మికుడు. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో తన పొలంలోని తాటి చెట్ల నుంచి తాటాకులు కోయడానికి వెళ్లి, రాత్రి 9 గంటల వరకు కూడా ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన అతని భార్య ఉష తన కుమారుడితో కలిసి ఆచూకీ కోసం వెతకగా ఓ తాటిచెట్టు కింద సంతోష్ చెప్పులు కనిపించాయి. పరిసరాల్లో పరిశీలించగా తాటిచెట్టు కింద ఉన్న బావిలో పడి విగత జీవిగా కనిపించాడు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు గ్రామస్తుల సహకారంతో బావిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

మ్యాన్‌హోల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాంగోపాల్‌పేట్: ఓ హోటల్ సమీపంలోని మ్యాన్ హోల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ ఎస్డీరోడ్‌లోని గ్రాండ్ మినర్వా హోటల్ వెనుక వైపు హోటల్‌కు సంబంధించిన డ్రైనేజీ మ్యాన్‌హోల్ ఉంది. బుధవారం హోటల్‌కు సంబంధించిన మురుగు నీరు వెళ్లకపోవడంతో తనిఖీ చేసిన ప్లంబర్ మ్యాన్‌హోల్‌లో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా పరిశీలించిన పోలీసులు పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి ఒంటిపై ప్యాంటు, చొక్కా మాత్రమే ఉన్నాయి. మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ సైదయ్య, ఇన్‌స్పెక్టర్ పరశురాం, డీఐ ప్రసాద్ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం


ప్రవీణ్ కుమార్(ఫైల్)

హిమాయత్‌నగర్ : ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బాల్యతండాకు చెందిన ధరావత్ రాందాస్ కుమారుడు ధరావత్ ప్రవీణ్ కుమార్(20) నారాయణగూడలోని అభ్యశ్రీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ జేఈఈ మెయిన్స్‌కు కోచింగ్ తీసుకుంటున్నాడు. రెండుసార్లు ప్రయత్నించినా ర్యాంక్ రాకపోవడంతో మనస్తాపానికి లోనైన అతను ఈనెల 12న తల్లిదండ్రులకు ఫోన్ చేసి బాధపడగా వారు అతడికి సర్దిచెప్పారు. మంగళవారం తల్లిదండ్రులు ప్రవీణ్‌కు ఫోన్ చేయగా అతను ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆందోళనకు గురైన వారు బుధవారం ఉదయం హాస్టల్‌కు వెళ్లి చూడగా ప్రవీణ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బాలుడి అనుమానాస్పద మృతి


వర్ధన్ (ఫైల్)

కీసర: అనుమానాస్పద స్థితిలో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చీర్యాలకు చెందిన మహేష్, మంజుల దంపతుల కుమారుడు బర్లపాటి వర్ధన్ (17) 10 వ తరగతి చదువుకున్నాడు. ప్రస్తుతం కరెంట్ బిల్లుల రీడింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గది నుంచి దుర్వాసన వస్తుండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు తెరిచి చూడగా వర్ధన్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. నాలుగు రోజుల క్రితమే అతను మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. వర్ధన్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కౌన్సెలింగ్‌కు వచ్చిన వ్యక్తి గుండెపోటుతో మృతి


ఇర్ఫాన్ మృతదేహం

రాజేంద్రనగర్: భార్యభర్తల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో కౌన్సెలింగ్ కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... కిస్మత్‌పూర్ దర్గా ఖలీజ్ ఖాన్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇర్ఫాన్ (35) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడి ఇద్దరూ భార్యలు ఉన్నారు. అయితే కొన్ని రోజులుగా అతను మరో మహిళతో ఉంటున్నాడు. ఈ విషయమై రెండో భార్య ఇషాద్ బేగం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు భార్యభర్తలను మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం ఇంటికి వెళ్లాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ నుంచి బయటికి రాగానే ఇర్ఫాన్ రోడ్డుపై ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు అతడిని అత్తాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు గుండెపోటుగా నిర్ధారించి మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించచిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇర్ఫాన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పోషకాహార లోపాన్ని నివారించాలి

మహేశ్వరం: పోషకాహార లోపాన్ని ఎదుర్కోడానికి కేంద్రం సుపోషిత్ గ్రామ పంచాయతీ అభియాన్‌ను ప్రవేశపెట్టిందని కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పోషణ అభియాన్ కన్సల్టెంట్ అధికారి పరిత జైలం పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సుభాన్‌పూర్, దుబ్బచర్ల గ్రామంలో సుపోషిత్ గ్రామ పంచాయతీ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆమెతో పాటు కేంద్ర బృందం, మహేశ్వరం సీడీపీఓ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన పోషకాహారం, మొత్తం ఆరోగ్యాన్ని నిర్ధారించే పద్ధతులను అనుసరించి, గ్రామాలను ప్రోత్సహించడమే సుపోషిత్ గ్రామ పంచాయతీ అభియాన్ లక్ష్యమన్నారు. మహేశ్వరం ఐసీడీఎస్ ప్రాజెక్టు జిల్లాలోని 25,493 కార్యక్రమాల ద్వారా ప్రజల్లో పోషణ పట్ల అవగాహన కల్పించామని సీడీపీఓ తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కేంద్ర కన్సల్టెంట్ అధికారులు డామన్, రామకృష్ణ, మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ, దుబ్బచర్ల ప్రభుత్వ వైద్యాధికారి మల్లికార్జున్, సూపర్‌వైజర్లు ఇందిర, సువర్ణ, విద్యావతి, అంగన్‌వాడీ టీచర్లు సుమతి, అనిత, సంతోష తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేశాడు...

- భార్యతో విడాకులు తీసుకుంటున్నానని చెప్పి..
- డాక్టర్‌తో ప్రేమాయణం..
- పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడి..
- గర్భం దాల్చిన వైద్యురాలు..
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

బంజారాహిల్స్: నా తల్లితో ఆస్తి గొడవలు ఉన్నాయి..నా భార్య నాతో సఖ్యంగా ఉండదు..అందుకే విడాకులు తీసుకుంటున్నాం..అందుకు సంబంధించిన విడాకులు పత్రాలు ఇవిగో అంటూ వైద్యురాలిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ వ్యక్తి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చింది. చివరకు సదరు వైద్యుడి అసలు నిజ స్వరూపం తెలియడంతో తాను మోసపోయానని బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే..ఢిల్లీకి చెందిన భరత్ గెరా నగరంలోని కొండాపూర్ ప్రైమ్ స్ప్లెండర్‌లో ఉంటూ బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని డెరెడియా లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో హెచ్‌ఆర్ ఆపరేషనల్ హెడ్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే పనిచేస్తున్న ఓ వైద్యురాలితో అతడికి పరిచయం ఏర్పడింది. ఇద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో గత ఏప్రిల్‌లో భరత్ సదరు యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు తనకు గతంలోనే వివాహం జరిగిందని, తన భార్యతో గొడవల కారణంగా విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పాడు. న్యాయవాది ఎదుట ఇద్దరూ సంతకం చేసిన పత్రాలను కూడా ఆమెకు చూపించాడు. తన తల్లికి తనకు ఆస్తి గొడవలు ఉన్నాయని, తల్లి, సోదరుడు ఢిల్లీలో ఉంటారని చెప్పాడు. ఈ క్రమంలో మార్చి 31న కంపెనీ పనిపై చండీఘడ్ వెళుతున్న భరత్ సదరు వైద్యురాలిని కూడా తీసుకెళ్లి అక్కడ హోటల్ రూంలో బస చేశారు. ఆ సమయంలో భరత్ ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత భరత్‌ను కంపెనీ యాజమాన్యం ఉద్యోగంలో నుంచి తొలగించగా, అతడితో పాటు సదరు యువతి కూడా ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఇద్దరూ కలిసి సొంతంగా వ్యాపారం ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పెట్టుబడి నిమిత్తం ఆమె నుంచి భరత్ రూ.2.5 లక్షలు తీసుకున్నాడు. అంతేగాక భరత్ సదరు యువతి ఫోన్‌లో లొకేషన్‌ను ట్రాక్ చేసి ఆమె ఎక్కడికి వెళ్తుందని ఆరా తీయడం మొదలుపెట్టాడు. ఈ నేపథ్యంలో వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె భరత్‌తో మాట్లాడేందుకు అతని ఇంటికి వెళ్లగా అతడి భార్య ఇంట్లో ఉండటాన్ని చూసి షాక్‌కు గురైంది. ఆరు నెలల గర్భవతిగా ఉన్న అతని భార్య కూడా వైద్యురాలిని అసభ్యంగా దూషించడమేగాక వివాహితుడితో ఎందుకు సంబంధం కొనసాగిస్తున్నావంటూ నిలదీసింది. ఆ తర్వాత భరత్, అతని భార్య పూణెకు మకాం మార్చారు. కొన్ని రోజుల తర్వాత గర్భం దాల్చిన బాధితురాలు భరత్ తనను శారీరకంగా, ఆర్థికంగా వాడుకుని మోసం చేశాడంటూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.